క్లుప్తంగా

విద్యార్థులను అభినందించిన ఆర్టీవో



అభినందిస్తున్న ఆర్టీవో

రామకృష్ణాపూర్: హైదరాబాద్‌లోని రవీంద్ర భారతీలో కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఐకాన్ అవార్డు అందుకున్న రామకృష్ణాపూర్‌కు చెందిన విద్యార్థులను మంచిర్యాల ఆర్టీవో వివేకానందరెడ్డి గురువారం ప్రత్యేకంగా అభినందించారు. కరాటేలో రాణిస్తున్న విద్యార్థులకు ఈ ఐకాన్ అవార్డు అందించగా విద్యార్థులు లాస్య, సమీక్ష, అక్షయ, నిఖిత, సాకేత్‌నందన్, ప్రియదర్శిని, నందన, హర్షితతో పాటు కోచ్‌లు గీతాదేవి, ముషిణి వెంకటేశ్వర్లును ఆర్టీవో అభినందించారు.

నేడు టీయూడబ్ల్యూజే జిల్లా రెండో మహాసభ

పాతమంచిర్యాల: తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీయూడబ్ల్యూజే) జిల్లా 2వ మహాసభ జిల్లా కేంద్రంలోని ఫైర్‌స్టేషన్ పక్కన గల సురభి గ్రాండ్ రెస్టారెంట్ ఫంక్షన్ హాల్లో ఈ నెల 28న శుక్రవారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపిరెడ్డి ప్రకాష్‌రెడ్డి, ఐజేయూ సభ్యులు కాచం సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు నగునూరి శేఖర్, ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. టీయూడబ్ల్యూజే సభ్యత్వం కలిగిన ప్రతి జర్నలిస్టు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభించింది. విప్రో, హెచ్‌డీఎఫ్‌సీ, మహీంద్ర, ముతూట్ ఫైనాన్స్, బీపీవో, ఆక్సిస్ బ్యాంకు సుమారు 10కంపెనీల ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళా నిర్వహించగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మొత్తం 47మంది విద్యార్థులు పలు కంపెనీల్లో ఉద్యోగాలకు సెలక్ట్ అయ్యి, నియామకపత్రాలు అందుకున్నారు. తెలంగాణ ప్లేస్‌మెంట్ సెల్ కమిషనర్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ నవీన్‌మిట్టల్ హాజరై విద్యార్థులతో మాట్లాడారు.

‘అభివృద్ధిని ఓర్వలేకనే ఆరోపణలు’

మంచిర్యాలటౌన్: పాతమంచిర్యాలలోని 8, 9వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని, చేసిన అభివృద్ధి కళ్లకు కనబడడం లేదా అని బీఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నారు. పాతమంచిర్యాలలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మూడేళ్లగా పాతమంచిర్యాలలో రూ.10కోట్లతో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు కావాలనే అభివృద్ధి చేయడం లేదని ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు అవసరం

కాసిపేట: సీసీ కెమెరాలు నేర నియంత్రణ, స్వీయరక్షణకు చాలా ఉపయోగపడతాయని మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ‘నేనుసైతం కమ్యూనిటీ పోలీసింగ్’లో భాగంగా గురువారం కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాసిపేటలో 3 సీసీ కెమెరాలు, దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పల్లంగూడలో 3 సీసీ కెమెరాలు గ్రామస్తులు ఏర్పాటు చేసుకోగా సీఐ ప్రారంభించారు. కార్యక్రమంలో కాసిపేట ఎస్సై గంగారాం, దేవాపూర్ ఎస్సై విజయేందర్, సర్పంచ్‌లు దేవి, దుస్స విజయ, గ్రామస్తులు తదితరులున్నారు.

భీమిని: సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, వ్యాపారస్తులు ముందుకు రావాలని కన్నెపల్లి ఎస్సై నరేష్ అన్నారు. కన్నెపల్లి మండలంలోని మెట్‌పల్లి, సుర్జాపూర్ గ్రామాల్లో గురువారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. అనంతరం లింగాలలో ప్రజలకు సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు.

భగీరథ మహర్షి జయంతి

బెల్లంపల్లి: భగీరథ మహర్షి జయంతి వేడుకలు పట్టణంలోని తాపీసంఘం భవనంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కౌన్సెలర్ గెల్లి రాజలింగు, సగర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంజల కుమార్, బెల్లంపల్లి పట్టణసీనియర్ నాయకుడు రాంకుమార్, మాజీ అధ్యక్షుడు పంతంగి రవీందర్ తదితరులు భగీరథమహర్షి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీనివాస్, మల్లేష్, కొమురయ్య, స్వామి, సంతోష్, రాజమల్లు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



నచ్చిన ఆట నేర్చుకుందాం..!

- మే 1 నుంచి ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు
- జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- నెల రోజులపాటు వివిధ క్రీడల్లో నాణ్యమైన కోచింగ్
- చిన్నారులు సెలవులు సద్వినియోగం చేసుకునేలా ప్రణాళిక

మంచిర్యాలటౌన్: ఏటా వేసవి సెలవుల్లో విద్యార్థులు ఇంట్లో ఖాళీగా ఉండకుండా వారికి ఆసక్తి ఉన్న క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తుంటారు. ఖర్చుతో కూడుకునేలా శిక్షణ ఉంటే పేద, మధ్య తరగతి ప్రజలకు క్రీడలు చేరువయ్యే అవకాశం తక్కువగా ఉంటుందనే ఉద్దేశంతో, ప్రభుత్వం ఏటా వేసవి సెలవుల్లో మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నెల రోజుల పాటు, జిల్లాలోని పలు ప్రాంతాల్లో పలు క్రీడల్లో ఉచితంగా శిక్షణను అందించేలా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసింది. అందులో భాగంగానే మంచిర్యాల జిల్లాలోనూ ఉచితంగా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయగా, వాటిని చిన్నారులు సద్వినియోగం చేసుకుంటే వారికి నచ్చిన క్రీడల్లో రాణించేందుకు అవసరమైన మెలకువలను నేర్చుకునేందుకు చక్కని అవకాశం కలుగనుంది.

క్రీడల శిక్షణకు అవకాశం

వేసవిలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను మే 1వ తేదీ నుంచి జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆటల్లో ఆసక్తి ఉండి, నేర్చుకోవాలనే జిజ్ఞాస ఉన్న పిల్లలకు నాణ్యతతో కూడిన శిక్షణను ఇచ్చేందుకు స్పోర్ట్స్ ట్రెయినర్లు, పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు సిద్ధంగా ఉన్నారు. మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నెల రోజుల పాటు, అందించే క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకుంటే పిల్లలకు చదువుతో పాటు, ఆటల్లో ప్రావీణ్యం లభిస్తుంది.

క్రీడ	నేర్పించే చోటు	కోచ్‌పేరు	ఫోన్ నంబర్
అథ్లెటిక్స్	ప్రభుత్వ డిగ్రీ కళాశాల,మంచిర్యాల	కె. భాస్కర్	9989168145
బాస్కెట్‌బాల్	జెడ్పీ బాలుర పాఠశాల,మంచిర్యాల	శ్రీనివాస్	96035 29603
బాక్సింగ్	"	రాజేష్	9963539234
ఫుట్‌బాల్	"	కృష్ణ	9700071606
కరాటే	"	నాగలక్ష్మి	9949627059
తైక్వాండో	"	రోహిత్	7680873626
వాలీబాల్	"	అనుదీప్	7675875234
బ్యాడ్మింటన్	మంచిర్యాల క్లబ్, మంచిర్యాల	రాజలింగు	98495 05695
వుషు	బెల్లంపల్లి తిలక్ స్టేడియం	సతీష్	9640319854
అథ్లెటిక్స్	ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చెన్నూర్	సంతోష్	6302254332
ఫుట్‌బాల్	మందమర్రి సింగరేణి హైస్కూల్	సురేందర్	8519878452
ఫుట్‌బాల్	బెల్లంపల్లి గ్రౌండ్ నంబర్ 2	వనిత	8121305992
వాలీబాల్	రామకృష్ణాపూర్ ఠాగూర్‌స్టేడియం	శ్రీనివాస్	7386348800
బాస్కెట్‌బాల్	రామకృష్ణాపూర్ ఠాగూర్‌స్టేడియం	కుమార్	9849438348
తైక్వాండో	బెల్లంపల్లి	రాజేశ్	9949016997

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పలు రకాల క్రీడల్లో ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నాం. ఆసక్తి ఉన్న విద్యార్థులు శిక్షణ అందించే కోచ్‌ల ఫోన్ నంబర్‌కు కాల్ చేసి, శిక్షణలో చేరవచ్చు. ఈ వేసవి సెలవులను క్రీడల్లో శిక్షణ కోసం విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. నెలరోజుల్లో వారికి నచ్చిన క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలి. – శ్రీకాంత్ రెడ్డి, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి

కౌన్సిల్ సమావేశంలో ఎనిమిది తీర్మానాలు



మాట్లాడుతున్న కమిషనర్

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించగా ఎనిమిది అంశాలపై సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాల చెల్లింపునకు రూ.144.71లక్షలు సాధారణ నిధుల నుంచి చెల్లించేందుకు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న ఈపీఎఫ్ చెల్లించేందుకు రూ.30లక్షల 91వేలు సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు, మున్సిపాలిటీ కార్యాలయ అవసరాల దృష్ట్యా స్టేషనరీ కొనుగోలు కోసం రూ.2లక్షలు ఖర్చు చేసేందుకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, వైస్‌చైర్మన్ సాగర్‌రెడ్డి, మేనేజర్ నాగరాజు, టీపీఎస్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై అధికారుల కొరడా

- హద్దురాళ్లు తొలగింపు
- అనుమతిలేని ప్లాట్లు కొనద్దని హెచ్చరిక



నస్పూర్‌లో అక్రమ వెంచర్లలోని హద్దురాళ్లు తొలగింపజేస్తున్న సిబ్బంది

నస్పూర్: పట్టణ పరిధిలో వెలసిన అక్రమ వెంచర్లపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. నస్పూర్ పరిధిలోని రెండు, తీగల్‌పహాడ్‌లోని రెండు సీతారాంపల్లి పరిధిలోని నాలుగు మొత్తం ఎనిమిది అక్రమ వెంచర్లలోని హద్దురాళ్లను మున్సిపల్ సిబ్బంది బ్లేడు ట్రాక్టర్‌తో గురువారం తొలగించారు. వెంచర్లలోని రోడ్లను చెరిపేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రమేష్ మాట్లాడుతూ.. పట్టణంలో అనుమతులు లేకుండా ఎవరూ వెంచర్లు ఏర్పాటు చేయరాదని సూచించారు. అనుమతులు లేని వెంచర్లను ఏర్పాటు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేని వెంచర్లలో ప్రజలు ఎవరూ ప్లాట్లను కొనుగోలు చేసి మోసపోవద్దని సూచించారు. అనుమతులు లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే వారికి భవిష్యత్‌లో ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వమని పేర్కొన్నారు.

ఆ వెంచర్ల వైపు కన్నెత్తి చూడని అధికారులు..

పట్టణ పరిధిలోని మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే దారిలో నూతనంగా నిర్మితమవుతున్న సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణానికి సమీపంలో సుమారు నాలుగు నుంచి అయిదు అనుమతులు లేని వెంచర్లు వెలియగా, ఆ వెంచర్ల వైపు మున్సిపల్ అధికారులు కన్నెత్తి చూడకపోవడంలో ఆంతర్యం ఏమిటని పలువురు పట్టణ వాసులు ప్రశ్నిస్తున్నారు.

రాజకీయ జోక్యంతోనే..

నస్పూర్ మున్సిపాలిటీలో అడ్మినిస్ట్రేషన్ విభాగంలో రాజకీయ జోక్యం ఎక్కువయ్యిందని, పలువురు మున్సిపల్ ఉద్యోగులే బహిరంగంగా తమ అసహనాన్ని వెళ్లగక్కుతున్నారు. తమ విధులను తాము సక్రమంగా నిర్వహించుకోకుండా పలువురు ప్రజాప్రతినిధులు అడ్డుపడుతుండంతో తాము మానసికంగా కుంగిపోతున్నామని పలువురు మున్సిపల్ సిబ్బంది వాపోతున్నారు. పట్టణంలో వెలసిన అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకుందామని సిబ్బందితో వెళ్తే సదరు వెంచర్ల యజమానులు మాపై తిరగబడుతున్నారని వారు పేర్కొన్నారు. కొంత మంది ప్రజాప్రతినిధులు ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని వెంచర్ల యజమానులు మమ్మల్ని నిలదీస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖ అధికారులు అన్ని అక్రమ వెంచర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు వెంచర్ల యజమానులు డిమాండ్ చేస్తున్నారు.

అభివృద్ధి పనులు వందశాతం పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ రాహుల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని పలు మండలాలో నిర్దేశించిన అభివృద్ధి పనులను 100శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్(స్థానిక సంస్థలు) అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శేషాద్రి, జెడ్పీ సీఇవో నరేందర్‌తో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు అభివృద్ధి పనుల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతల్లో నిర్దేశించిన అభివృద్ధి పనులను పూర్తి స్థాయిలో సాధించాలని, గ్రామస్థాయి నుంచి జరిగే విప్లవాత్మకమైన అభివృద్ధి పనులు గుర్తించి జిల్లాకు అవార్డు వచ్చే స్థాయిలో చేపట్టాలని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు సమన్వయంతో పని చేస్తూ, మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి, ఏపీవోలు, డీఎల్‌పీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

లక్సెట్టిపేట: విద్యార్థినులు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు పొందాలని స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ క్రిష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సార్ఆర్ ఫంక్షన్ హాల్లో గురువారం వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాల వీడ్కోలు సమావేశం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిగ్రీ పూర్తి చేసిన తరువాత ఉన్నత చదువులు చదవాలంటే, కాంపిటేటివ్, పోటీ పరీక్షలు రాయాల్సి ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఏకాగ్రతతో చదివి మంచి కోర్సులు సాధించాలన్నారు. సెల్‌ఫోన్‌ల వాడకం తగ్గించాలని, చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్సై లక్ష్మణ్, కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల కిరణ్, చెట్ల రమేష్, అభి, కళాశాల అధ్యాపకులు, డైరెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని వినతి



ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

మంచిర్యాలటౌన్/మంచిర్యాలఅగ్రికల్చర్: హాజీపూర్ మండలంలోని రాపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లోని రైతులు వరికోతలను జరిపి 20రోజులు దాటినా ఐకేపీ, డీసీఎంఎస్ నుంచి వరి కొనుగోల్లు ప్రారంభించలేదని, వెంటనే ప్రారంభమయ్యేలా చూడాలని ఆయా గ్రామాల రైతులు గురువారం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నాయని, వరిధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని, స్థానికంగా ఉన్న రైస్‌మిల్లులకు వడ్లను కొనుగోలు చేసేలా ట్యాగింగ్ ఇచ్చి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు బొలిశెట్టి అశ్విన్ రెడ్డి, చెలిమల్ల సుధాకర్, శ్రీనివాస్, మారు వెంకట్ రెడ్డి, లక్ష్మయ్య, మల్లేశ్, రాజయ్య పాల్గొన్నారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

బెల్లంపల్లి: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా గురువారం బెల్లంపల్లిలో ముస్లిం మైనార్టీ వర్గాలు ఆందోళన చేశాయి. సామూహికంగా కాంటా చౌరస్తా వద్దకు తరలివచ్చిన ముస్లింలు అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు.

పోస్టాఫీస్ సేవలు ప్రారంభం

జన్నారం: మారుమూల అటవీ ఆదివాసీ గిరిజన గ్రామం దొంగపల్లిలో నూతనంగా పోస్టాఫీస్ బ్రాంచ్ కార్యాలయాన్ని గురువారం గ్రామస్తులతో కలిసి జిల్లా అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ రామారావు ప్రారంభించారు. పోస్టల్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు.

కార్యవర్గం ఎన్నిక

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీలో గురువారం జిల్లా భట్రాజు సంఘం కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. యువజన విభాగం అధ్యక్షుడిగా దేవరాజ్‌సందీప్, ఉపాధ్యక్షుడిగా కేసీ పెద్ది హరిహరణ్ రాజ్, ప్రధాన కార్యదర్శిగా అంబటి దిలీప్‌రాజు, మహిళా విభాగంలో జిల్లా అధ్యక్షురాలుగా ఎర్ర సువర్ణ, ఉపాధ్యక్షురాలుగా అడ్లూరీ సరస్వతి, ప్రధాన కార్యదర్శిగా బిరుద రాజు విజయ, సహాయ కార్యదర్శిగా తంగెళ్ల రమాదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కార్మికులకు అంబలి పంపిణీ

మంచిర్యాలఅర్బన్: వేసవి నేపథ్యంలో ఆర్టీసీ యాజమాన్యం డిపోలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు అంబలి పంపిణీ చేస్తున్నారు. మధ్యాహ్నం 12.30గంటల ప్రాంతంలో రోజుకు 700మంది చొప్పున జొన్న అంబలి అందిస్తున్నామని డీఎం రవీంద్రనాథ్ తెలిపారు.

న్యాయం చేయాలని నిరసన

పాతమంచిర్యాల: మహిళా రెజ్లింగ్ క్రీడాకారులకు న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రేంకుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మహిళలతో కలిసి నిరసన ప్రదర్శన చేపట్టారు.

బీజేపీలో పలువురి చేరిక

దండేపల్లి: మండలంలోని తానిమడుగు గ్రామానికి చెందిన పలువురు గురువారం బీజేపీలో చేరగా వారికి పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రతి ఒక్కరూ చదువుకోవాలి

లక్సెట్టిపేట: ప్రతి ఒక్కరూ చదువు నేర్చుకోవాల ని వయోజన విద్యా జిల్లా ఉపసంచాలకులు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చందారంలో గురువారం వయోజన విద్యాకేంద్రాన్ని పరిశీలించి వలంటీర్లకు అవగాహన కల్పించారు.

కార్మిక సదస్సు

పాతమంచిర్యాల: మే డే సందర్భంగా తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న రైతుబజార్‌లో కార్మిక సదస్సు నిర్వహిస్తున్నట్లు, ఈ కార్మిక సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికసంఘం అధ్యక్షుడు జైపాల్‌సింగ్ తెలిపారు.

క్రీడాప్రాంగణాలు వినియోగించుకోవాలి

- ట్రెయినీ కలెక్టర్ గౌతమి



క్రీడాప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న గౌతమి

భీమిని: మండలంలోని తెలంగాణ క్రీడాప్రాంగణాల ను యువకులు వినియోగించుకోవాలని ట్రెయినీ కలెక్టర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ గౌతమి సూచించారు. మండలంలోని చిన్నతిమ్మాపూర్, తంగళ్లపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలను ఆమె గురువారం ప్రారంభించారు. అనంతరం వాలీబాల్ ఆడా రు. కంటివెలుగు శిబిరాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నర్సరీలను పరిశీలించి చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలని సూచించారు. ఆమె వెంట ఎంపీఓ సఫ్దర్ ఆలీ, ఏపీఓ భాస్కర్‌రావు, సర్పంచ్‌లు ఇందూరి భూమయ్య, ఉపసర్పంచ్ , పంచాయతీ కార్యదర్శి తిరుపతి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బుయ్యారానికి చేరిన ప్రజా పోరుయాత్ర



చంద్రశేఖర్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

వేమనపల్లి: సీపీఐ ప్రజాపోరు యాత్ర గురువారం వేమనపల్లి మండలం బుయ్యారం గ్రామానికి చేరింది. సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోరుయాత్ర కొనసాగుతుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం చేస్తున్న ప్రజాపోరుయాత్రను ఆదరించాలని కోరారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక కార్యకలాపాలు ప్రజలు తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అందె పురుషోత్తం, బొంతల లక్ష్మి, అందె మహేష్, చంద్రయ్య, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

బొగ్గు గనులపై జెండా ఆవిష్కరణ



జెండా వందనం చేస్తున్న నాయకులు, కార్మికులు

తాండూర్: బెల్లంపల్లి ఏరియా బొగ్గుగనులు, విభాగాల్లో గురువారం బీఆర్ఎస్ జెండా ఆవిష్కరించారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో పతాకావిష్కరణ చేశారు. ఏరియా వర్క్‌షాప్ , అబ్బాపూర్ ఓసీపీ వద్ద టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు జెండా ఆవిష్కరించి, అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. బీఆర్ఎస్ ఆవిర్భావాన్ని వివరించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్రచీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాష్‌రావు, చర్చల ప్రతినిధి మంగీలాల్, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఎస్ఓ టు జీఎంకు సన్మానం

శ్రీరాంపూర్: ఏరియా ఎస్ఓ టు జీఎం త్యాగరాజును ఏరియా వర్క్‌షాప్ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ నెలాఖరుతో రిటైర్డ్ అవుతున్న ఆయన్ను గురువారం వర్క్‌షాప్ వద్ద డీజీఎం బీ.చంద్రశేఖర్‌రెడ్డి, అధికారులు, ఉద్యోగులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఈఈ రమేశ్‌బాబు, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట 2 గని మేనేజర్‌కు..

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట2 గని మేనేజర్‌గా నూతనంగా బాధ్యతాలు స్వీకరించిన జి. లక్ష్మినారాయణను అధికారులు, యూనియన్ల నాయకులు, ఉద్యోగులు గురువారం పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. ఉద్యోగులందరం కలిసి కట్టుగా పనిచేస్తూ, రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రూప్ ఆఫ్ ఏజెంట్ రాజేందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సంపత్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి మల్లేష్, నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పొలాస వ్యవసాయ కళాశాల సందర్శన

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ వేముల కృష్ణ గురువారం రైతులతో కలిసి జగిత్యాలలోని పొలాస వ్యవసాయ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వర్మి కంపోస్టు, భూసార పరీక్షలు, ఇతర సాగు పద్ధతులు తెలుసుకున్నారు. వర్మి కంపోస్టు గ్రామపంచాయతీల్లో సక్సెస్ కాకపోవడానికి కారణాలను అగ్రికల్చర్ సీనియర్ విద్యార్థులను అడిగి అనుమానాలు నివృత్తి చేసుకున్నారు. ఆయన వెంట ముత్యంపల్లి సర్పంచ్ ఆడె బాదు, ఆదర్శ రైతు పెంటయ్య, మండల రైతులు తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

కొనసాగుతున్న వీవోఏల సమ్మె

చెన్నూర్/వేమనపల్లి/కాసిపేట/దండేపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/లక్సెట్టిపేట/భీమిని/నెన్నెల: జిల్లా వ్యాప్తంగా వీఓఏల సమ్మె కొనసాగుతుంది. సమ్మెలో భాగంగా బుధవారం చెన్నూర్‌లో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపగా, లక్సెట్టిపేటలో బిక్షాటన చేస్తూ, కాసిపేటలో రోడ్డుపై ముగ్గులు వేసి, వేమనపల్లి, దండేపల్లిలో రోడ్డు ఊడ్చి నిరసన తెలిపారు. కన్నెపల్లి, నెన్నెలలో వీఓఏలకు బీజేపీ నాయకులు కొయ్యల ఏమాజీ మద్దతు తెలుపారు.

సెలవుల్లో నిర్మాణాలు పూర్తి చేయాలి

చెన్నూర్: వేసవి సెలవుల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు పాఠశాలల నిర్మాణం, మరమ్మతు పనులు పూర్తి చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మామిడి అక్షిత అన్నారు. పాఠశాలల నిర్మాణాలు వేసవి సెలవుల్లో పూర్తి చేయాలని కోరుతూ గురువారం డీఈవో వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందజేశారు.

ప్రీ స్కూల్ కార్యక్రమాలు విధిగా నిర్వహించాలి

బెల్లంపల్లి: వేసవి సెలవుల్లో ప్రీ స్కూల్ కార్యక్రమాలను విధిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని బెల్లంపల్లి సీడీపీవో ఉమాదేవి కార్యకర్తలకు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడారు. అనంతరం కార్యకర్తలకు మెడికల్ కిట్ అందజేశారు.

విజయవంతం చేయండి

పాతమంచిర్యాల: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఈ నెల 30న నిర్వహించే బీసీ న్యాయవాదుల సదస్సును విజయవంతం చేయాలని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్, బీసీ న్యాయవాదుల సంఘం నాయకులు కొత్త సత్తయ్య కోరారు.